# జరగని కథ

కార్తికేయరావు ఆ వూరికి రావడం మంచిదే అయింది. ఆ గృహప్రవేశ మహోత్సవానికి అతను వచ్చినందుకు అతని స్నేహితుడు విద్యాసాగర్‌తో పాటు కుటుంబ సభ్యులందరూ చాలా సంతోషించారు. ఆ పల్లెటూర్లో కార్తికేయరావు స్నేహితుడు విద్యాసాగర్ ఓ డాబా ఇంటిని కట్టించాడు. అతను ఆ వూరి స్కూల్లో టీచర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. స్నేహితుడి మనసు గాయపరచడం ఇష్టంలేక తను వుంటున్న నగరం నుంచి వీలు చూసుకొని ఆ పల్లెటూరికి వచ్చాడు కార్తికేయరావు.

మధ్యాహ్నం భోజనాలయిన తరువాత సాయంత్రం నాలుగు గంటల వరకూ విశ్రాంతి తీసుకొని ఆపైన వాళ్లందరి దగ్గరా సెలవు తీసుకొని తిరుగుప్రయాణం అయినాడు.

జంక్షన్ వరకూ వెళ్లే వూళ్లోకి రాదు. ఊరు పక్కనుంచి వెళుతోన్న తారురోడ్డుమీద ఒకచోట ఆగుతుంది. అక్కడకు వెళ్లి బస్సు వుందని చెప్పాడు విద్యాసాగర్. అక్కడి నుంచి ఓ పది నిమిషాల నడక.

ఊరును ఆనుకునే పొలాలు. అన్నీ జొన్నచేలు. వాటికి మధ్య వున్న గట్టుమీద నుంచి నడిచి వచ్చి ఓ పొలం మలుపు తిరిగితే తారురోడ్డు కనబడుతుంది. రోడ్డు పక్కనే పెద్ద నేరేడు చెట్టు.

అదే స్టాపని చెప్పాడు విద్యాసాగర్.

"ఇక నువ్వు వెళ్లు.... ఇంటి నిండా బంధువులు వున్నారుగదా" అన్నాడు కార్తికేయరావు.

ఓ పది నిమిషాలు అక్కడ నిల్చుని వెళ్లిపోయాడు విద్యాసాగర్.

సాయంత్రం ఎండలో తీక్షణత లేదు. అయిష్టంగా తల వూపుతున్నట్లు గాలికి కదులుతోంది నేరేడు చెట్టు.

కార్తికేయరావు అరగంటసేపు నిల్చున్నా బస్సు రాలేదు. దూరంనుంచి రావాలనీ, ఒక్కొక్కసారి లేటుగా వస్తుందని చెప్పాడు విద్యాసాగర్ ఇంతకుముందు బస్సు గురించి.

రాని బస్సు గురించి ఆలోచిస్తున్నప్పుడు కార్తికేయరావు దగ్గరకు జొన్నచేను పక్కనుంచి నడిచి ఒకాయన వచ్చి నిల్చున్నాడు.

కొంచెం పెద్దాయన. కార్తికేయరావు తండ్రి బతికి వున్నట్టయితే అంత వయసు వుండివుంటుంది. సన్నగా కొంచెం పొడవుగా వున్నాడు. బిళ్ల గోచీపోసి ధోవతి కట్టుకున్నాడు. పొడుగుచేతుల చొక్కాను సగం చేతుల వరకూ మడుచుకున్నాడు. పూర్తిగా నెరిసిన తలవెంట్రుకలు. చేతిలో లగేజీ ఏమీ లేదు.

"బస్సు రాలేదుకదా" అని అడిగాడు ఆయన కార్తికేయరావును.

"ఇంకా రాలేదు" అన్నాడు కార్తికేయరావు.

"ఈ బస్సులు ఎప్పుడూ సమయానికి రావు" అన్నాడాయన.

ఆయన్ని కొంచెం పరీక్షగా చూసిన తర్వాత కార్తికేయరావుకు తండ్రి గుర్తుకువచ్చాడు. అప్రయత్నంగా అతని కళ్లల్లో నీళ్లు తిరిగాయి. తండ్రి చనిపోయిన తర్వాత కార్తికేయరావుకు తండ్రిమీద ప్రేమ మరింత ఎక్కువయ్యింది.

సంసారాన్ని నెట్టుకు రావడానికి తను పడుతున్న ఇబ్బందులను చూసిన తర్వాత తండ్రి తమందరినీ ఎలా పెంచాడో, అందుకు ఎన్ని కష్టాలను ఎదుర్కొన్నాడో గ్రహించిన అనంతరం తండ్రిమీద అతనికి వున్న ప్రేమ రెండింతలయ్యింది.

"మీ పేరు తెలుసుకోవచ్చునా?" అడిగాడు కార్తికేయరావు.

"కనకసుందరం" చెప్పాడాయన.

"నీ పేరు చెప్పనేలేదు" నవ్వుతూ అడిగాడు కనకసుందరం.

చెప్పాడు.

తనది ఆ వూరేనని, జంక్షన్ వరకూ వెళుతున్నాననీ చెప్పాడు కనకసుందరం.

గంట గడిచింది.

కార్తికేయరావుకు కాళ్లు పీకుతున్నాయి. కూర్చోవడానికి అక్కడ ఏమీ లేదు.

కానీ, నేరేడు చెట్టును ఆనుకొని కిలోమీటరు దిమ్మె వుంది. దానిమీద కూర్చున్నాడు.

అప్పుడు కనకసుందరం ఇలా అన్నాడు.

"కార్తికేయా.... కాలక్షేపానికి నీకో విషయం చెపుతాను. మధ్యలోకానీ, చివర్లోకానీ నువ్వు నన్ను ఎలాంటి ప్రశ్నలు అడక్కూడదు"

తల వూపాడు కార్తికేయరావు.

"ఇంతకుముందు ఇలా అంటే బస్సుకోసం ఎక్కువసేపు ఊరి బయట ఎదురుచూసిన సంఘటన నీ జీవితంలో ఎప్పుడయినా జరిగిందా అడిగాడు

కనకసుందరం.

"జరిగే వుంటుంది. కానీ గుర్తుకు రావడంలేదు"

"పోనీ.... నన్ను చెప్పమంటావా?"

"మీరు చెబుతారా?" ఆశ్చర్యంగా అన్నాడు కార్తికేయరావు.

"అవును"

"ఐతే చెప్పండి"

"దాదాపు ఇరవై యేళ్ల క్రితం జరిగిన సంఘటన. నువ్వు, మీ నాన్న మీ చెల్లెలి పెళ్లి సంబంధం గురించి మీ బందువుల ఇంటికి ఓ పల్లెటూరికి వెళ్లారు. ఆ వూళ్లోకి కూడా బస్సు రాదు. ఇలాగే వూరి బయటకు వచ్చి ఎక్కాలి. మీరిద్దరూ సాయంత్రానికి బస్సుకోసం వచ్చి వూరి బయట నిల్చున్నారు. రెండు గంటలకుపైగా నిలబడినా బస్సు రాలేదు. కానీ మీ నాన్నకు కోపం వచ్చింది. తనకు కాళ్లు పీకుతున్నాయని, ఇక బస్సుకోసం నిలబడననీ చెప్పి తిరిగి వూళ్లోకి వెళ్లడానికి వెనక్కు తిరిగాడు. ఆయన కొంచెం దూరం వెళ్లగానే బస్సొచ్చింది. పరిగెత్తుకుంటూ వచ్చి నీతో పాటు బస్సులోకి ఎక్కాడు" అని ముగించాడు కనకసుందరం.

"మా నాన్నకు ఓర్పు తక్కువ" అన్నాడు కార్తికేయరావు.

"నిజమే.... మీ నాన్నకు లాగానే నాక్కూడా ఓర్పు తక్కువ. నాకూ కాళు లాగుతున్నాయి. ఇంటికి వెళుతున్నాను" అని గబగబా నడిచి జొన్నచేను మలుపు తిరిగాడు.

అప్పుడు ఉలిక్కిపడ్డాడు కార్తికేయరావు.

తనకి, తన తండ్రికి మాత్రమే తెలిసిన ఈ సంఘటన గురించి ఈయనకు ఎలా తెలుసు? అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలిగాడు. అంటే ఈ కనకసుందరం.

నేరేడు చెట్టు కిందనుంచి పరిగెత్తాడు కార్తికేయరావు. జొన్నచేను మలుపు దగ్గరకు వెళ్లాడు. సూటిగా వుంది పొలం గట్టుమీది కాలిబాట. కానీ కనకసుందరం కనిపించలేదు. ఇంతలోనే ఏమయ్యాడు?

అప్పుడే బస్సు వచ్చిన శబ్దం వినిపించింది. తల తిప్పి చూసినప్పుడు నేరేడు చెట్టు కింద బస్సు ఆగివుంది. ధోవతీ చెరుగును చేత్తో పట్టుకొని బస్సులోకి ఎక్కుతున్న కనకసుందరం కనిపించాడు.

రోడ్డుమీదకు ఎక్కాడు కార్తికేయరావు. అతనికి అంతా అయోమయంగా వుంది.

కనకసుందరం ఎక్కడినుంచి వచ్చాడు? ఆ సంఘటన గురించి ఎలా చెప్పగలిగాడు? ఆయనకు ఎలా తెలుసు? అయితే తన తండ్రి ఈ రూపంలో వచ్చాడా? ఇదెలా సాధ్యం? చనిపోయినవాళ్లు తమకు ఇష్టమైన సంతతికి ఇలా కనబడతారా?

ఈ ఊహ రాగానే కార్తికేయరావు శరీరం సంతోషంతోనూ, ఏదో తెలియని భయంతోనూ కంపించింది.

బస్సు బయల్దేరుతున్నప్పుడు చెయ్యెత్తి ఆపాలనే ఆలోచన కూడా అతనికి రాలేదు. అతని పక్కనుంచి బస్సు వెళుతున్నప్పుడు కిటికీ పక్కనే కూర్చున్న కనకసుందరం తల బయటకు పెట్టి కార్తికేయరావును చూసి నవ్వుతున్నాడు.

"నాన్నా" పెద్ద కేకపెట్టి బస్సు వెనకాలే పరుగుతీశాడు కార్తికేయరావు. ❖

*నవ్య వీక్లీ, 6-6-2007*